# సన్మానయోగి

## కథ

**సన్మానం జరుగుతున్నది ఆ వేదిక మీద.**

**సభాస్థలి జనంతో నిండిపో యింది.**

**మరి సన్మానం జరుగుతున్నది ఊరు పేరు లేని వాడికి కాదుగా-**

**ఆంధ్ర దేశమంతా ఆదరించే ప్రముఖ కవి, రచయితకు జరుగు తున్నది ఆ సన్మానం.**

అతగాడి కీర్తి రాష్ట్రం నలుమూలలా వ్యాపించడమే కాకుండా- దేశం నలుమూలలా కూడా వ్యాపించింది.

రచయితల సంఘం కార్యదర్శి కామేశ్వరరావు ఊదరకొట్టేస్తున్నాడు నగ్నశ్రీ గురించి.

''నగ్నశ్రీ గారు నిజంగా ఆంధ్రుల అదృష్టం వలన ఆంధ్రలో జన్మించారు. ఆయన కనుక ఏ బెంగాల్ లోనో జన్మించి ఉంటే ఆయన జాతీయ కవిగా కాకుండా అంతర్జాతీయ కవిగా గుర్తించబడేవారు. అదే ఆయన అమెరికాలో పుట్టుంటే విశ్వకవిగా కీర్తింపబడి ఉండేవాడు. నోబులు ప్రైజు దొరకపుచ్చుకొని ఉండేవాడు.

ఆయన రాసిన 'చచ్చిపోరా గాడిదా' అన్న నవ్య కావ్యానికి ఎన్ని నోబులు ప్రైజులిచ్చినా తక్కువే! ఎటొచ్చి ఆ కావ్యం అనువాదానికి లొంగదు. ఆ మాటకొస్తే ఆయన రచన ఏదీ కూడా అనువాదానికి అనుకూలంగా ఉండదు. అన్నిట్లోను స్వచ్ఛమైన తెలుగు తిట్లు- కొండొకచో పచ్చిబూతులు ఉంటాయి. వాటిని ఏ అనువాదకర్త ఎలా అనువదించగలుగుతాడు? అంతటి నేటివిటీ ఉంది మన కవిగారిలో. ఇంక వారు రాసిన 'నగ్న హృదయం' నవల ఆంధ్రలో త్సునామీని సృష్టించిందంటే అతిశయోక్తి కాదు. అందరి మనసుల్ని నగ్నంగా ఆవిష్కరిస్తుంది ఈ నవల. భేషజాలకు పోకుండా - వంచనలకు తావులేకుండా మనసులో ఏ ఆలోచన కదిలిందో దాన్ని కాగితం మీదకి ఎక్కించాడు నగ్నశ్రీ. అందుకే అది అంత బాగుంది'' అంటూ దంచి పారేస్తున్నాడు. ఆయన రాసిన కవితల్లోంచి కొన్ని వాక్యాలు- నవలల్లోంచి కథల్లోంచి ఆణిముత్యాల్లాంటి మాటలు కోట్ చేస్తున్నాడు మధ్యమధ్యలో.

ప్రేక్షకుల నుండి ఈలలు- చప్పట్లు మారుమ్రోగాయి.

ఆ తరువాత కూడా చాలామంది నగ్నశ్రీ గారి గొప్పతనం గురించి గొప్పగా పొగిడారు.

''నగ్నశ్రీగారు నగ్నంగా వస్తారని భయపడ్డాను. ఫర్లేదు ఆయన సభా మర్యాదను పాటించి బట్టలు వేసుకునే వచ్చారు'' అని ఒకళ్లు చమత్కరించారు.

''నగ్నశ్రీ గారు కుటుంబంతో రారనుకున్నాను-సకుటుంబ సపరివారంగా శుభ్రంగా వచ్చారు'' అని ఇంకోరు పొగిడారు అతన్ని.

''టీవీల దెబ్బకు సాహిత్యం గిజగిజ కొన ఊపిరితో కొట్టుకుంటూ ఉంటే నగ్నశ్రీ గారి నవలలు-కవితలు ఆ సరస్వతీ తల్లికి పెట్టిన ఆభరణాలు పాఠకుల సంఖ్యను పెంచాయి. కొని చదవాలన్న తాపత్రయాన్ని ఆయన రచనలు తెలుగు పాఠకుల్లో కలిగించాయి'' అంటూ పొగుడుతున్నాడు అధ్యక్షుడు అచ్చయ్య.

''అసలు నగ్నశ్రీ గారు ఆంధ్రలో పుట్టకుండా ఉంటే ఆంధ్ర సాహిత్యం అసంపూర్తిగా ఉండిపోయేది. సద్యో యవ్వనాన్ని పొందిన ఆంధ్రుల కవిత వీరి చేతిలో పడి కొంగ్రొత్త పోకడలు పోయింది. ఆంధ్రులు ఆరంభశూరులు కారు, రంభలాంటి కవిత్వాన్ని కూడా సంరంభంగా రాయగలరు అని నిరూపించారు నగ్నశ్రీగారు'' అంటూ ఇంకో ఉప కార్యదర్శి మెచ్చుకొన్నారు.

ఇంతకూ రంభకూ కవిత్వానికి ఉన్న సామ్యమేమిటో అక్కడున్న ఆసాములకు అర్థం కాలేదు.

ఇంతలో ప్రకటన వినిపించింది మైకులో.

''మన అదృష్టం కొద్దీ సినీ కవి తిక్కస్వామి వేంచేశారు. తిక్కస్వామి పాటలంటే శ్రోతలు - ప్రేక్షకులు చెవులు ముక్కు కోసుకుంటారని మీ అందరికీ తెల్సు. వారు కొన్ని వందల పాటలు రాసి యువతీయువకుల గుండెల్ని గాయపరిచారు. విరహంతో వేధించారు. మాటలతో మజా అందిస్తారు. అటువంటి గొప్ప సినీ కవి తన చేతుల మీదుగా నేటి ముఖ్య అతిథి నగ్నశ్రీ గార్ని సన్మానించమని కోరుతున్నాను'' రచయితల కార్యదర్శి మనవి చేశాడు.

సభ కరతాళ ధ్వనులతో మ్రోగిపోయింది.

తిక్కస్వామి పేరుకు తగ్గట్టు తిక్కతిక్కగా ఉన్నాడు. ఊడిపోతున్న ప్యాంటును పైకి లాక్కుంటూ - చొక్కాకు ఊడిపోతున్న బొత్తాలను పెట్టుకుంటూ నములుతున్న కిళ్లీతో వేదికను అలంకరించాడు.

ఒక కుర్చీ తెచ్చి వేదిక మధ్యలో అందరికీ కనిపించేట్టు వేశారు. నగ్నశ్రీగార్ని అందులో ఆశీనులు కమ్మన్నారు. ఆయన సిగ్గుపడుతూ వచ్చి అందరికీ నమస్కరించి అందులో కూర్చొన్నారు.

ఆ తరువాత తిక్కస్వామిని పిల్చి శాలువా కప్పమన్నారు. తిక్కస్వామి ఆ శాలువాను తనకు కప్పుకున్నాడు. సభను అలంకరించిన వారు బిత్తరపోయారు. ప్రేక్షకులు చప్పట్లు కొట్టారు. ''తిక్కస్వామి గార్కి శాలువాల మోజు ఉన్నట్లుంది - ఏమీ అనుకోకండి ఇంకో శాలువా సిద్ధంగా ఉంది - దానిని నగ్నశ్రీ గార్కి కప్పండి'' అధ్యక్షులు వేడుకున్నారు.

తిక్కస్వామి శాలువాను తన ఒంటిమీంచి తీసేసి శాలువా ఖరీదు ఎక్కడుందాని పరిశీలించారు. ఆ తరువాత దాన్ని నగ్నశ్రీ గారి భుజాల మీద కప్పుతూ అన్నాడు.

''ఈ మూడు వందల రూపాయల శాలువాను మూడు వేల రూపాయల శాలువాగా భావించండి. మీ రచనలకు ఖరీదు కట్టడం కాదు- కాని - మీలో సాహిత్య పిపాసకు బట్ట కప్పడం ఈ సన్మానం'' అని చమత్కరించాడు తిక్కస్వామి.

ఆ తరువాత రోజా పూలదండ ఇచ్చారు వేయామని.

''ఈ దండలు వేసే ఆచారం మన దేశంలో ఎప్పుడు అంతరిస్తుందో - మనిషి చనిపోయినా దండ వేస్తున్నారు - సన్మానించినా దండ వేస్తున్నారు. ఒక్క రోజులో వాడిపోయే దండలు వేసి వారిని అవమానిస్తున్నారు. దాని బదులు చందనమాలో - కాగితం పూలమాలో వేస్తే కలకాలం దాచుకోవచ్చుగా - చంద్రుడికో నూలుపోగులా నగ్నశ్రీ గార్కి ఈ రోజాపూలదండ - వారి మెడ నిండా - వారొక తొణకని నిండు కుండ - మ్రోగించండి చప్పట్లు చేతుల నిండా - మనకేల భయం వారుండ!'' అంటూ బుల్లి కవిత కూడా చదివి కవిగారి చేతులు పట్టుకుని గట్టిగా పిసికాడు.

'చచ్చానో దేవుడోయ్' అనుకున్నాడు నగ్నశ్రీ ఆ బాధకి.

అధ్యక్షుల వారు చిన్న పర్సు కూడా అతనికి ప్రజెంటు చేశారు.

నగ్నశ్రీని మాట్లాడమని ప్రేక్షకులు గోలపె

**వియోగి**

ట్టారు.

''అయ్యా! స్పీకాల్సిన స్పీకర్లు చాలామంది ఉన్నారు. చివర్లో నగ్నశ్రీ గారు మాట్లాడతారు - అప్పటి దాకా ఓపిక పట్టండి'' అని కార్యకర్తలు నచ్చచెప్పబోయారు.

''లేదు - వారు ఇప్పుడే మాట్లాడాలి'' అని చప్పట్లు చరిచారు.

''మీ ఆతృత చూస్తూ ఉంటే కుర్చీలు ఇరగ్గొట్టేట్టున్నారు కనుక - నగ్నశ్రీగార్ని మైకు విర్గొట్టమని - సారీ - మైకు పట్టుకోమని కోరుతున్నాను'' అంటూ అధ్యక్షులు వారికి మైకు అందించాడు.

ఈలలు - చప్పట్లు - కేకలు - కొన్ని బూతులు...

''మీ అందరికీ వందనాలు! ఇంతమంది అభిమానులు నాకు దొరకడం నా అదృష్టంగా భావిస్తున్నాను. నిజానికి ఈ సన్మానానికి నేను అర్హుడ్ని కాను - నా కంటే బాగా రాసే సినీ కవి తిక్కస్వామి మన మధ్య ఉన్నారు. వారు రాసినట్లు నగ్నంగా నేను రాయలేను'' నగ్నశ్రీ మాట్లాడుతున్నాడు.

''వారి కవిత్వానికి ఎన్ని అర్థాలుంటాయో ఎవరికీ తెలీదు.''

ఇంతలో ఓ వెధవకి ఓ వెధవ అనుమానం తొలిచేసింది.



''నగ్నంగా రాయడమంటే - రాసేప్పుడు బట్టలు వేసుకోకుండా మొండి మొలతో రాస్తారా?'' అడిగేశాడు.

అందరూ నవ్వారు.

''లేదు - లేదు - నగ్నంగా రాయడమంటే రాసేప్పుడూ బట్టలు విప్పెయ్యను - రాసింతర్వాత విప్పెయ్యను - భేషజాలు లేకుండా అతి వాస్తవికతను రాస్తాను'' చెప్పాడు సిగ్గు పడుతూ.

''పేపరోళ్లు ఎలాగూ ఉన్నది ఉన్నట్టు రాస్తారుగా - ఇంక మీరు రాసేదేంటి గోంగూర'' ఎవ్వరో అరిచారు.

''వారు వార్తలు కథనంగా రాస్తే - నేను కళాత్మకంగా రాస్తాను. వారి వార్తల జీవితకాలం ఒక రోజు నా రచనలకు జీవితం అనూహ్యం. ఈ భూమి - సూర్యుడు ఉన్నంత కాలం నా రచనలు నిలబడతాయి. నాది చైతన్య స్రవంతి కథనం - అంటే మనిషికి వచ్చిన ఆలోచనల్ని యధాతథంగా రాస్తాను. అతనిపైన ఎన్ని ఒత్తిళ్లు ఉన్నాయో - అతని మనసు ఎంత ఘర్షణ పడుతున్నాదో పచ్చిగా రాస్తాను సంప్రదాయంపై తిరుగుబాటు బావుటా ఎగురవేస్తాను. ఈ సంఘం చేతిలో మనిషి ఎలా కీలుబొమ్మై నాశనమై పోయాడో రాస్తాను'' అంటూ తన కవితా ధోరణి గురించి చెప్పకురాసాగాడు. కాసేపటికి అతను కూర్చొన్నాడు.

''నగ్నశ్రీ గార్ని ఎవరైనా సన్మానించదల్చుకుంటే సన్మానించవచ్చు మళ్లీ మళ్లీ ఛాన్సు రాదు'' చెప్పారు అధ్యక్షులు ''కాని ఒక్క షరతు.''

''కొంపదీసి సన్మానించే వాళ్లు నగ్నంగా వచ్చి సన్మానించమని పెట్టడు కదా కండీషను'' ఒక శ్రోతకు అనుమానం పీడించింది.

''మీరు మాట్లాడదల్చుకున్నా ఒక్క నిమిషంలో ముగించాలి'' చెప్పాడు.

వెంటనే చాలామంది దండలు పట్టుకుని వేదిక పైకి వచ్చారు. వరుసగా అతని మెడలో హారాలు పడుతున్నాయి. కొందరు మైకాసురులు ఉపన్యాసాలిచ్చారు.

చివరగా ఓ బక్కప్రాణి దండ పట్టుకుని పైకి వచ్చాడు- సభకు దండాలు పెడుతూ.

బిక్కుబిక్కుమంటూ అతని మెడలో వేశాడు - వెంటనే మైకు దగ్గరికి లాక్కున్నాడు.

''మహాశయులారా! నేను ఈ దండని ఎందుకు వేశానో తెల్సా - నగ్నశ్రీ గార్ని సన్మానిస్తూ అని కదూ మీరు అనుకుంటున్నది?''

''అవును సన్మానించావు - సందేహమెందుకు?''

''ఆ! సన్మానిస్తూనే - కాకపోతే కాస్త తేడా ఉంది - చాలా మంది ఆయన కవిత్వం పట్ల ఆయన కథనం పట్ల ఆకర్షితులై సన్మానించారు.. కాని నేను సన్మానించింది అందుకు గాదు-''

''మరెందుకు టైం వేస్టు చెయ్యకు - ఒక్క నిమిషం అయిపోయింది - దిగెయ్యి!'' అధ్యక్షులు మొరటుగా అన్నారు.

''క్షమించాలి..నేను సన్మానించింది నగ్నశ్రీ గారు

**ఆంధ్రభూమి దినపత్రిక ఉగాది కథల పోటీలో ఎంపికైన రచన**

ఆంధ్రులకు ఆదర్శప్రాయులుగా నిలిచారు ఒక దాంట్లో - ఎందులోనంటే నిషిద్ధాక్షరాలను ఒక చోట కూర్చారు. కవులు - రచయితలు ఏం రాయకూడదో ఎలా రాయకూడదో రాసి చూపించారు - సాహిత్యం ఎలా ఉండకూడదో పాఠకులకు తన చక్కటి - చిక్కటి రచనలతో తెలిపారు'' గుక్క తిప్పుకోవడానికి ఆగాడు.

''ఇంక చాల్లే దిగవయ్యా - టైము అయిపోయింది - ఒకటే నస!'' అధ్యక్షులు విసుక్కున్నారు.

''లేదు - అతన్ని మాట్లాడనివ్వండి - అతని పేరేంటో కనుక్కోండి'' కొందరు అరిచారు దాంతో అధ్యక్షులు శాంతించారు.

''నా పేరు అవధాని! ఎన్నో వందల అవధానాలు చేశాను. ఎన్నో గ్రంథాలు రచించాను. అన్నిటికి మించి నేను నిత్య పాఠకుడ్ని - శ్రోతను. అందుకే నగ్నశ్రీ గార్ని అడుగుతున్నాను. సూటిగా సమాధానం చెప్పండి... మనిషి మృగంగా పుట్టాడు - వెన్నెముక గల జంతువుల్లో అతనూ ఒక జంతువు. మనిషి మృగం నుండి మానవుడిగా మారడానికి కొన్ని లక్షల సంవత్సరాలు పట్టింది. కానీ ఈ మనిషిని మృగంగా మార్చడానికి ఒక్క క్షణం చాలు - ఒక్క బూతుగ్రంథం చాలు. నరుడు వానరుడుగా మారడానికి. అతను తోక జాడించకుండా ఉండటానికి - అతనిలోని చపలత్వం పోవడానికి - అతనిలోని మృగలక్షణాలు మృగ్యం చేయడానికి ఇన్ని పాఠశాలలు - కాలేజీలు - శిక్షణా తరగతులు - చట్టాలు - రాజ్యాలు అవతరించాయి. శిశువు పశువుగా కాకుండా పెంచడానికి తల్లిదండ్రులు ఎంతో కష్టపడుతున్నారు. ఎన్నో లక్షలు ఖర్చు పెట్టి విద్యాబుద్ధులు గరపుతున్నారు. కానీ నగ్నశ్రీ గారి రచనలు చదివితే ఎంతో క్రమశిక్షణ కల్గిన పాఠకుడు కూడా క్షణాల్లో మృగంగా అవతరిస్తాడు. ఇది అవసరమా? సాహిత్యం ఉద్దేశ్యం ఇదేనా? చెడు నేర్చుకోవడం కష్టం కాదు - చెడిపోవడం చాలా సులభం - దానికి ప్రత్యేక తరగతులు గాని శిక్షణ గాని అక్కర్లేదు - కాని ఒక గాంధీ - ఒక బుద్ధుడు - ఒక మహావీరుడు - ఎప్పుడో కాని అవతరించరు. అటువంటి వారి ఆదర్శం మనకు కావాలి! జాతిని నడిపించే జాతిపితలు వారు. ఆ వెలుగురేఖల్ని రచయితలు - కవులు ప్రసరింపజేయాలి. గాడ్సే ఆదర్శాలు మనకెందుకు? ఆటంబాంబులు మనకెందుకు? అటామిక్ రియాక్టర్లు కావాలి కరెంటు ఉత్పత్తి కోసం. దుష్ట నాయకులను హీరోలుగా చేసి పూజిస్తున్నాం - వీధిరౌడీ మనస్తత్వాన్ని - ఆవారా హృదయాలను పల్లకి ఎక్కిస్తున్నాం ... మన సినిమాలు అలాగే తగలడ్డాయి - ఆంధ్ర రౌడీ - తెలుగు రౌడీ - తెలుగు దొంగ - దొంగగారు - వగైరా పేర్లతో సినిమాలు వస్తున్నాయి - అవే మన జాతిని నిర్దేశిస్తున్నాయి. ఇంక సినిమా పాటలు చెప్పక్కర్లేదు - ప్రేమలు - దోమలు - బూతు పదాలు - నీలిదృశ్యాల చిత్రీకరణ! అగ్నికి ఆజ్యం పోసినట్లు కేబుల్ టీవీలు కూడా మరింత కలుషిత వాతావరణం కలుగజేస్తున్నాయి. పిచ్చి పిచ్చి ప్రకటనలు - తిక్క తిక్క సీరియల్సు - వంకర టింకర యాంకర్లు! ఇవన్నీ ఎవరు రాస్తున్నారు? నగ్నశ్రీ కాకపోతే ఇంకో దిగంబరశ్రీ - ఇంకో బూతుశ్రీ - వీరి పేరు కోసం - వీరి సంపాదన కోసం తెలుగుజాతి సంస్కృతిని కాలరాస్తున్నారు. జాతిని భ్రష్టు పట్టిస్తున్నారు. అమాయక హృదయాల్లో పెనుకాలుష్య తుఫాన్లు రేపుతున్నారు. దీనికి ఇటువంటి కవులకు, రచయితలకు ప్రతినిధిగా నగ్నశ్రీ గారు సంజాయిషీ ఇచ్చుకోవాలని కోరుతున్నాను'' అంటూ అవధాని గుక్క తిప్పుకోకుండా చెప్పాడు.

అధ్యక్షులతో సహా సభను అలంకరించిన వారు బిగుసుకుపోయారు. ముందుగా తేరుకున్న తిక్కస్వామి మైకు లాక్కున్నాడు.

''అవధాని చెప్పిన మాటలు వినడానికి బాగుంటాయి - కానీ కాలే కడుపుతో ఉంటే తెలుస్తుంది మా బాధ - పాఠకులు ఏవి కోరుకుంటున్నారో అదే అందిస్తున్నాము - ప్రేక్షకులు ఏమి ఆశిస్తున్నారో అదే ప్రదర్శిస్తున్నాం - ఇందులో మా తప్పు లేదు'' చెప్పాడు తిక్కస్వామి ఖరాఖండితంగా.

''అయితే నీ కూతురు 'భస్తాను విషం కావాలి నాన్న' అంటే తెచ్చిస్తావా? నీ కొడుకు 'దమ్ముకొడతా'నంటే మాదకద్రవ్యాలు తెచ్చిస్తావా?'' అవధాని అడిగాడు.

''ఛీ! ఛీ! ఎందుకు తెస్తాను. వాళ్లకు బుద్ధి లేకపోతే నాకుండద్దూ'' తిక్కస్వామి అన్నాడు.

''ఆ! అదే నే చెప్పేది. ప్రేక్షకులు - పాఠకులు మీకు పిల్లలతో సమానం కాదా? రచయితలు - కవులు గురుపీఠం అధిరోహించిన వారు కాబట్టి గురువు తన విద్యార్థులకు ఎలా మంచి బోధిస్తాడో అదే మంచి మీరు కూడా ప్రజలకు బోధించాలి. సెన్సేషన్ పేరుతోనో - విప్లవాల పేరుతో - కాలకూట విషాన్ని ప్రజల్లో వదలకూడదు. ఒక చక్కటి కుటుంబ వ్యవస్థ ఏర్పడడానికి, మనుషుల మధ్య ప్రేమ అనురాగం ఏర్పడడానికి ఇన్ని వేల సంవత్సరాలు పట్టింది. దాన్ని భద్రంగా కాపాడవలసిన బాధ్యత అందరి మీదా ఉంది. కవిగా - రచయితగా మీ బాధ్యత ఇంకా ఎక్కువగా ఉంది. అంతేగానీ చైతన్యస్రవంతి రాస్తాను - ఇంకేదో రాస్తానంటూ కుంటిసాకులు చెబ్తూ పిచ్చి పిచ్చి ఆలోచనలు రాయవద్దు'' అవధాని హెచ్చరించాడు.

ప్రేక్షకులు చప్పట్లు కొట్టారు, ఈలలు వేశారు.

''కవికి స్వేచ్ఛ ఉండాలి - అది లేంది ఎలా రాస్తాడు?'' నగ్నశ్రీ ఆక్రోశం.

''నీ స్వేచ్ఛ బంగారం కాను, నువ్వు ముందు, సమాజంలో ఒక భాగానివి. అందరి స్వేచ్ఛను గుర్తించు - ఎవరి మనసులు పాడుచెయ్యకు - అప్పుడు అందరూ నీ స్వేచ్ఛను గుర్తిస్తారు. పౌరుడిగా ముందు నీ బాధ్యత నిర్వహించు'' అవధాని అతనిపై విరుచుకుపడ్డాడు.

''కలంపైన ఆంక్షలు విధించే వాడెవడూ బాగుపడడు 'రవి కాంచనిచో కవిగాంచు' అని ఊరకే అనలేదు. కవి ఎక్కడ గౌరవించబడతాడో అక్కడే నాగరికత వర్ధిల్లుతుంది'' నగ్నశ్రీ గర్జించాడు.

''ఐడిల్ మ్యాన్స్ బ్రెయిన్ ఈజ్ ఎ డెవిల్స్ వర్క్‌షాప్ అని వినలేదా? అంటే పనిలేని వాడి మెదడులో దెయ్యాలు ఖార్ఖానా తెరుస్తాయి. నువ్వు సమాజ ఉద్ధరణ కోసం మంచి పని చేస్తూ ఉంటే చెత్త - చెత్త ఆలోచనలు ఎలా వస్తాయి? అలసిన శరీరానికి నిద్ర వస్తుంది కాని - జోరీగల కవిత్వం రాదు. సంఘం ఇస్తున్న సమస్త సౌకర్యాలను, సుఖాలను అనుభవిస్తూ ఆ సంఘాన్ని ఆదిమ మానవ దశకు తీసుకుపోదామని ప్రయత్నించడం బాధ్యతారాహిత్యం - అవివేకం!'' అవధాని తీవ్రంగా ఖండించాడు.

''నా పాటికి నా పాటలు రాసుకుంటూ నా పాట్లు పడుతూండే వాడిని - నన్ను ఇక్కడకు తెచ్చి అవమానిస్తారా?'' వాపోయాడు తిక్కస్వామి.

''మహిళా సంఘాలు మేల్కొని నీ పాటల్ని బహిష్కరించే రోజు వచ్చేస్తున్నాది జాగ్రత్త తిక్కస్వామి? నువ్వు తిక్క పాటలు రాస్తే నిన్ను ముక్కలు ముక్కలు చేసేరోజు వస్తుంది. ముందుంది ముసళ్ల పండుగ జాగ్రత్త!'' హెచ్చరించాడు.

''ఈ సభ ఇంతటితో ముగిసింది'' అని ప్రకటించాడు అధ్యక్షుడు- ప్రేక్షకులు ఈలలు, చప్పట్లు కొడ్తూ కుర్చీల్లోంచి లేచారు.

